
కథ

# (అ)ధర్మం!

ఆర్.జగదీశ్వరరావు




"ఏమండీ! గిఫ్ట్ ఏం కొంటారూ? " రాజమండ్రి వెళుతున్న శ్రీవార్ని అడిగింది వీధి ద్వారందాకా వచ్చిన రాణి.

"ఏం కొనమంటావ్?" చెప్పులు వేసుకుంటూ అడిగాడు రావ్.

"ఏమయినా కొనండి మీ యిష్టం. అయితే కొంచం ఖరీదైనది మాత్రం కొనండి. ఇందులో ఆదా చేయకండి...అసలు విషయం...గిఫ్ట్ యిస్తున్నట్లు దానిమీద పెద్ద అక్షరాలతో రాయించండి. మనం యిచ్చినట్టుగా...మర్చిపోరుగా - దాని మీద పేరు రాయించడం?"

"సర్లేవోయ్! అలాగే" నవ్వుతూ అన్నాడు రావ్.

"అలాగే కాదు...రాజమండ్రిలోని గుండువారి వీధి సందులో..." అంటూ ఏ షాప్‌వాడు గిఫ్ట్‌లపై వాటిని యిచ్చినవారి పేర్లు చక్కగా నగిషీలా చెక్కుతాడో చెప్పి...

"అక్కడ వేయించుకు రండి" అని మళ్ళీ చెప్పింది రాణి.

"సరే" అంటూ బయలుదేరాడు రావ్.

రావ్, రాణీలు కాపురముంటున్న పల్లెటూరికి రోడ్ పాయింట్ సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. రావ్ సంపన్న కుటుంబంలో పుట్టినవాడు. చదువు, సంస్కారం ఉన్నాయి. తనతోటే యూనివర్శిటీలో చదువుకుంటున్న రాణిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు.

రెండు రోజుల్లో రాణి దగ్గర బంధువలమ్మాయి పెళ్ళి. అందుకని సర్వీసింగ్‌కి యిచ్చిన బుల్లెట్ మోటార్‌బైకుతో పాటు కొత్త దంపతులకివ్వాల్సిన గిఫ్ట్ తెచ్చుకునేందుకు రాజమండ్రి బయలుదేరాడు రావ్.

ఈనడానికి రెడీగా ఉన్న పచ్చని చేలుతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. రోడ్‌పాయింట్ చేరుకోవడానికి యింకా రెండు ఫర్లాంగులు దూరం ఉండగా...

"దరమం సేయండి బాబూ! ఆకలేస్తంది బాబూ!" అంటూ ఓ పదేళ్ళ కుర్రాడు రావ్ వెంటపడ్డాడు. కుర్రాడి వైపు చూసిన రావ్ దృష్టికి - దరిద్రానికి సంకేతాలుగా లోపలికి పోయినవాడి కళ్ళూ, లెక్కపెట్టడానికి వీలయినంత స్పష్టంగా కనిపిస్తున్న ఎముకలూ, చిరిగిన నిక్కరే కాకుండా వాడు వేసుకున్న చొక్కామీది అక్షరాలు - బాగా ఆకర్షించాయి. రావ్‌ని ఆలోచింపచేసాయి.

"నీలాపురం జమీందార్ శ్రీవీరవెంకటవరాహ సూర్యచంద్ర భాస్కరరావుగారి ధర్మం" అని రాసుంది.

ఆశ్చర్యపోయాడు రావ్.

ఈ జమీందారుకి ఏది ముఖ్యం? ధర్మం చెయ్యడమా? అలా చేసినట్లు ప్రచారం చెయ్యడమా? అని మనసులోనే ప్రశ్నించుకున్న రావ్‌కు సులభంగానే సమాధానం దొరికింది.

"ఏం బాబూ! ఆకలిగా ఉంది?" అడిగాడు రావ్.

అవునన్నట్లు తలూపాడు అబ్బాయి.

"సరే! నాతోరా." అంటూ కొద్దిదూరం వెళ్ళాక

"నువ్వేసుకున్న చొక్కా నీకెలా వచ్చింది? ఎవరిచ్చారు?" అని ప్రశ్నించాడు రావ్.

"తెలీదు" అన్నాడు కుర్రాడు.

తోవలో మరెన్నో ప్రశ్నలు వేసినా వాడిచ్చిన సమాధానాల్లో రావ్‌పై బాగా ప్రభావం చూపినవీ అతని మనసుని కల్లోలం చేసినవీ రెండేరెండు సమాధానాలు.

మొదటిది: తండ్రి బలవంతంపైనే వాడు అడుక్కుంటున్నాడు.

రెండు: కావల్సినంత సంపాదించి తండ్రి తాగుడుకు యిస్తే తప్ప వాడికి యింట్లో తిండి పెట్టరు.

రోడ్ పాయింట్‌కి చేరుకున్న రావ్, వాడిని అక్కడవున్న ఓ హోటల్‌కి తీసుకెళ్ళి, వాడికి ఏది యిష్టమో అవన్నీ తినిపించి...కొంత డబ్బు యివ్వాలనుకున్నా మళ్ళీ మనసు మార్చుకుని...వాడ్ని పంపేశాడు.

కుర్రాడికి యిష్టమయినవన్నీ తినిపించానన్న తృప్తి ఉన్నా వాడు వేసుకునే చొక్కాపై ఉన్న అక్షరాల గురించి రావ్ ఆలోచిస్తూనే ఉన్నాడు.

"రావ్ బాబూ! ఇప్పుడే రాజమండ్రి బస్ వెళ్ళిపోయింది. మళ్ళీ బస్‌రావడానికి అరగంట పడుతుంది" అన్నాడు హోటల్ యజమాని.

అలా నడిచొద్దామని ముందుకు వెళ్ళాడు రావ్.

అదే రోడ్‌పై...అదే తోవలో...ఎన్నో వందలసార్లు తిరిగినా...అక్కడ వున్నా బస్‌షెల్టర్...ముఖ్యంగా దానిపై రాసిన అక్షరాలు యీసారి రావ్ దృష్టిని ఆకర్షించాయి. బస్ ఆగే స్థలానికి ఓ ఫర్లాంగు దూరంలో...ఎవరూ...ఎప్పుడూ...కూర్చోని...ఆ షెల్టర్‌పై -

"సహృదయులూ, దానశీలురూ స్వర్గీయ వెంకట సుబ్బరాయుడుగారూ వారి సతీమణి శ్రీమతి మాణిక్యాం

బగార్ల ఏకైక కుమారరత్నం-

స్వర్గీయ ఎలపాటి లక్ష్మీనారాయణ, ఆయన ధర్మపత్ని సుగుణాంబికల జ్ఞాపకార్ధం-

వారి సుపుత్రులు-

శ్రీ ఎలపాటి చిన్న వెంకటసుబ్బరాయ్డు మరియు ఆయన ఏకైక ధర్మపత్ని శ్రీమతి నాగాంబికలు కట్టించిన బస్‌షెల్టర్." అని రాసివుంది.

షెల్టర్ కోసం నాలుగు సన్నని ఇనుపరాడ్స్, దానిపై నిలబెట్టిన డోరియారేకులూ కన్నా పైన చెప్పిన వాక్యాలు రాసేందుకు ఉపయోగించిన ప్లేటును అమర్చేందుకు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నట్లనిపించింది రావ్‌కు.

పబ్లిసిటీ కోసం మరీ యింత హంగామా అవసరమా? అనుకున్న రావ్...అంతలోనే..."అవునూ... ధర్మం చేస్తున్నపుడు ....పదిమందికీ ఉపయోగించే పనిచేస్తున్నపుడు...అలా చేసిన మంచిపని చెప్పుకోవటంలో తప్పేముంది?" అని సరి పెట్టుకుందామనుకున్నాడు రావ్.

కానీ ఎందుకో ఆ కుర్రాడి చొక్కామీద ఉన్న ముద్రలూ, బస్‌షెల్టర్‌పై వాక్యాలూ అలా అనుకోవడం సరికాదు అనిపిస్తున్నాయి.

రాజమండ్రి వెళ్ళే బస్ యింతలో రావడంతో రావ్ ఆలోచనకు బ్రేకులు పడ్డాయి. అరగంట ప్రయాణం తర్వాత రాజమండ్రిలోని గోకారం బస్‌స్టేండ్‌లో దిగి... మొదట బుల్లెట్ తెచ్చుకుందామని సర్వీసింగ్ సెంటర్‌కి వెళుతుండగా తోవలో శర్మ కనిపించి -

"అరరే...రావ్‌గారా! మీరింకా రాలేదిమిటా అని ఆశ్చర్యపోతున్నాను. శతాధిక కవిసమ్మేళనం ఈరోజే... ఇన్విటేషన్ అందింది కదా?" అన్నాడు శర్మ.

"ఆc! అందింది శర్మాజీ...అసలు నేనొచ్చింది అందుకే"

"ఏం సార్! ఒక్కరోజు ముందువస్తే బాగుండేది కదా? అందరం కలిసేవారం కదా?" అన్నాడు శర్మ.

"ఆ కలవడం యీ రోజయిన చెయ్యొచ్చుకదా శర్మాజీ" అన్నాడు రావ్. ఇక్కడ కలవడం అంటే కలిసి మందు కొట్టడం అది.

"అవును కదూ...ఈ వేళ కూడా కలవొచ్చు...కవి సమ్మేళనం అవగానే కలుద్దాం..."అని "నేను అర్జంటుగా వెళుతున్నాను సార్...అన్ని ఏర్పాట్లు చూడాలికదా? నాలుగ్గంటలకు తిన్నగా లైబ్రరికీ వచ్చేయండి" అంటూ చేతిలో చిన్న హేండ్‌బాగ్‌లాంటిది తిప్పుకుంటూ వెళ్ళిపోయాడు శర్మ.

శర్మ చేతిలోని బ్యాగ్ ఎందుకో యివాళ ప్రత్యేకంగా ఆకర్షించింది రావ్‌ను. ఖరీదు పట్టుమని పాతికరూపాయలుండదు. గిఫ్ట్ అంటూ ఓ ప్రముఖ బట్టలషాప్ వారు యిచ్చింది. గత రెండేళ్ళగా శర్మ చేతిలో అదే బ్యాగ్ చూస్తున్నాడు రావ్. అంటే రెండేళ్ళుగా తనకు తెలీకుండానే ఆ బట్టల షాప్‌వారికి రావ్ పబ్లిసిటీ యిస్తున్నాడన్నమాట! "ఎంత తెలివైనవారు యీ వ్యాపారస్తులు" మనసులోనే అనుకున్నాడు రావ్. అలా అనుకుంటూ సర్వీసింగ్ సెంటర్ దగ్గరకు వెళ్ళేటప్పటికి బులెట్ యింకా రెడీ కాలేదు. రావ్‌కి చిరాకేసింది. బండి యిచ్చిననాడే చెప్పాడు...ఫలానారోజు, పలానా టైముకు వస్తానని...ఒప్పుకున్నాడు...అయినా-

రావ్ బండి తయారయ్యేసర్కి టైమ్ నాలుగు కావొచ్చింది. గిఫ్ట్ కొందామనుకుని...అత్యంత ముఖ్యమయిన శతాధిక కవి సమ్మేళన కార్యక్రమానికి టైమ్ అయిపోతుందనుకొని లైబ్రరీ వైపు బయలుదేరాడు.

ఆశ్చర్యం! టైమ్ నాలుగ్గంటలు దాటుతున్నా...ఓ క్లర్క్...మరో యిద్దరూ తప్పిస్తే ఎవ్వరూ యింకా లైబ్రరీ దగ్గరకు చేరుకోలేదు.

కొద్దిగా కోపం వచ్చింది రావ్‌కు. రావలసిన వారంతా కవులు...వీరుకూడా పంక్చువాలిటీ పాటించకపోతే ఎలా? నిబద్దత...క్రమశిక్షణ...విలువలు...బాధ్యతలూ లాంటి పెద్ద...పెద్ద మాటలు మాట్లాడతారు గదా... అనుకున్న సమయానికి హాజరు కావాలనే కనీసజ్ఞానం ఉండదా?" అని మనసులో ఇంకేమేమో అనుకుంటున్నంతలో..వర్మ వచ్చాడు.

> "ఆఫ్యాన్ తిరిగితే దానిమీద రాసిన అక్షరాలు గుర్తు పట్టడానికి వీలుండదు. అంటే దాత ఎవరో పదిమందికి తెలియదు. అందుకని...ఫ్యాన్ అసలుకే తిరక్కూడదన్నది ఆ దాత షరతు."

ఇద్దరూ చూపులతోనే పలకరించుకుని "షేక్‌హేండ్స్" అయిన తర్వాత...

తన మనసులోని మాట అనేశాడు రావ్.

"మీరీ మధ్య మరీ చాదస్తం పెంచుకుంటున్నారు. ఆ మాత్రం రావడం కొంచం ఆలస్యమయితే..అంతగా ఫీల్ అయిపోతారెందుకూ...ఏదో అనివార్య కారణాలుండొచ్చుకదా?" అని సరిపెట్టబోతే-

"మహానుభావా! ఇక్కడ జరగబోయేది...శతాధిక కవిసమ్మేళనం...యీ వందమందికి...అనివార్యకారణాలున్నాయంటారా?"అన్నాడు రావ్.

"పోన్లెద్దురూ! తమకోసం యితరులు ఎదురు చూస్తే ...కొంతమందికదో సరదా...లేదా అదో బలహీనత అనుకుందాం...అదే మరి కొంతమందికి అబద్దాలాడడం బలహీనత...ఏమంటారూ?" చిన్నగా నవ్వుతూ అన్నాడు వర్మ.

"నాకు అబద్ధాలాడే వీక్‌నెస్ ఉందని డైరెక్టగా చెప్పొచ్చు కదా?" అని నవ్వేసి "రండి ఆ ఫాన్ కింద కూర్చుందాం" అంటూ హాల్లో ఫాన్ కింద ఓ కుర్చీలో కూర్చున్నాడు రావ్.

ఫాన్ ఆగి ఉంది. సిగరెట్ పారేయడానికి హాల్ బయటకు వెళ్ళి తిరిగి వచ్చిన వర్మ -"అదేంటీ! ఫాన్‌గాలి కావాలని అక్కడ కూర్చున్నారు?రండి యిక్కడ కూర్చుందాం" అని కొంచం దూరంలో ఉన్న ఫ్యాన్ కింద కూర్చున్నాడు.

"ఇక్కడ కూడా ఫాన్ ఉంది కదా!" పైనే ఉన్న ఫ్యాన్ చూస్తూ అన్నాడు రావ్.

స్విచ్ ఆన్ చేసి వచ్చిన వర్మ "అదా! దానికొక కథ ఉంది. అదొక విచిత్రమయిన కథగానీ...ఆఫ్యాన్ రెక్కలపై ఏం రాసుందో చదివి యిక్కడకు రండి... కథ చెపుతాను"

"శ్రీవీరవెంకట ధనంజయ కామేశ్వరరావుగారి ధర్మం" అని ఫాన్ రెక్కపై రాసున్న అక్షరాల్ని చదివి వర్మ దగ్గర కూర్చోని-

"ఆc! ఏంటీ! ఆ ఫ్యాన్ వెనుకవున్న విచిత్రకథ" అనడిగాడు రావ్.

"విచిత్రమో! విడ్డూరమో! మరేమయినా అనాలో నాకు తెలీదు..ఆ రెక్కమీద ఉన్న పేరు చదివారు కదా...?"

"ఆc! దాత పేరు."

"ఆc! సదరు దాత...ఫ్యాన్ యిచ్చినట్టే యిచ్చి దానికొక షరతు పెట్టాడు"

"ఏంటదీ?" కుతూహలంగా అడిగాడు రావ్.

"సదరు ఫ్యాన్ ఎప్పుడూ తిరక్కూడదు అని?!"

"అదేంటీ?" ఆశ్చర్యంగా అడిగాడు రావ్.

"అదంతే...ఆఫ్యాన్ తిరిగితే దానిమీద రాసిన అక్షరాలు గుర్తు పట్టడానికి వీలుండదు...అంటే దాత ఎవరో తెలియదు...అందుకని దాతపేరు అందరికీ తెలిసేలా...అందరూ ఎప్పుడూ...ఆ పేరు చూసేలా... ఫాన్ ఎప్పుడూ తిరగకుండా ఆ ఏర్పాటు చేసుకున్నాడు" అని నవ్వుతూ ముగించాడు వర్మ.

"నిశ్చేష్టుడయి పోయాడు రావ్! దీన్ని...వింత... విడ్డూరం...పిల్లచేష్ట...పిచ్చిచేష్ట...ఏమనాలో అర్థం కాలేదు. ఎందుకో అక్కడుండాలనిపించలేదు వర్మకు. ఏదో కారణం చెప్పి వచ్చేసాడు.

****

గుండువారి సందులో మంచి ఖరీదైన గిఫ్ట్ కొన్నాడు రావ్. డబ్బు చెల్లిస్తుండగా...

"సార్! గిఫ్ట్‌పై మీరిచ్చినట్లు పేరు రాయించమంటారా?" అన్నాడు షాప్ ఆయన.

"వద్దు" తనకు తెలీకుండానే రావ్ నోట్లోంచి ఆ మాటలు వచ్చేశాయి.


**రూ. 3,50,000/- విలువ గల బహుమతులు గెలవండి.**

| | | |
|---|---|---|
| 6 | 11 | 4 |
| 5 | 7 | 9 |
| 10 | 3 | 8 |



| | | |
|---|---|---|
| | | 5 |
| | 8 | |
| 11 | | |

అదనపు బహుమతి: హీరోహోండా, బజాజ్ చేతక్ స్కూటర్, ఆటోమేటిక్ కెమెరా, ఫ్రిజ్, ఎయిర్ కూలర్ సుమిత్, మిక్సర్ కం గ్రైండర్.

ప్రత్యేక అదనపు బహుమతి : మొదటి ఎంట్రీలను పంపిన 200 మందికి కలర్ టి.వి. లేదా వి.సి.ఆర్. ఉచితము. ఈ బహుమతులను M.B. మరియు H.P. స్కీము ద్వారా పొందగలరు.

తమరు చేయవలసినది ఏమనగా పోస్టలు కార్డుపై పై తెల్పిన విధముగా 9 గళ్ళు గీసి ఖాళీ చతురస్రములలో 4 నుంచి 12 అంకెలను ఉపయోగించి ఎటునుంచి కూడినా 24 వచ్చేలా పూర్తి చేయవలెను. ఒక అంకెను ఒకసారి మాత్రమే ఉపయోగించవలెను. గమనిక: తమ పూర్తి చిరునామాను ఇంగ్లీషులో వ్రాయుటవల్ల వెనువెంటనే తమ ఫలితము తెలుపబడును.

ADD. RADHA TRADERS (V/T) P.O. LAL BIGHA, (GAYA)



**చర్మపు మచ్చలు + కొత్త అన్వేషణ**

ప్యాచ్‌క్యూర్ వైద్యము — మచ్చలు పోగొట్టు తేలిక మార్గము

ప్యాచ్‌క్యూర్‌వైద్యము - సంవత్సరాలుగా పరిశోధించి ఎక్స్‌పెరిమెంట్లు మరియు టెస్టులు చేసి నాణ్యత గుర్తించిన తర్వాత రకరకములైన రంగుల మచ్చలుగల అనేకమందిపై 2 నుండి 8 వారములు ప్రయోగించటమైనది. ప్రయోగముచే రంగుమారుట, మచ్చలు పోగొట్టబడి అసలు చర్మము రంగులోనికి మారుట లాంటి అద్భుతమైన గుణములు రికార్డు చేయటమైనది. దీని సరాసరి ప్రభావము చర్మము మరియు రంగును గ్రహించు కణాలపై ఉండుటచే ప్రయోగము మొదలైన వెంటనే ప్రభావము కనబడును మరియు ఏరంగు మచ్చలైననూ తేలికగా తొందరలో మానగలవు. ఎరుపు, నలుపు, తెలుపు లేక ఏ ఇతర రంగు మచ్చలచేనైననూ బాధపడువారు కేవలము 15 దినములు మాత్రమే ఉపయోగించండి మరియు తీక్షణమైన ప్రభావమును చూడండి. పొందుటకు :- వయస్సు, మచ్చరంగు మరియు ఏ భాగముపైనున్నదీ వ్రాసిపంపుట తప్పనిసరి.

NATH AYURVEDASHRAM (A-4), P.O.KATRI SARAI (GAYA) 805105